వేణుదత్తాత్రేయ పాదపూజ మహోత్సవం

- సువర్ణలక్ష్మి, అష్టలక్ష్మి సిద్ధి వ్రతదీక్షావిరమణ


వేణుదత్తాత్రేయ ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో ఆదివారం మంజుల గోవింద్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేణుదత్తాత్రేయ పాదపూజ, సువర్ణలక్ష్మి, అష్టలక్ష్మి సిద్ధి వ్రతదీక్షావిరమణ మహోత్సవం వైభవంగా నిర్వహిచారు. లోకకల్యాణార్థం నిర్వహించిన కార్యక్రమంలో అవదూత రామదూత


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తిరుమలరాజు

స్వామి అనుచరుడు తిరుమలరాజు సందేశం ఇచ్చారు. విశ్వగురువు విష్ణుస్వరూపుడు అయిన అవధూత రామదూత స్వామి లోకకల్యాణార్థం పాటు పడుతున్నాడని కొనియాడారు. కార్యక్రమ నిర్వహకులు మంజుల మాట్లాడుతూ అవదూత వల్ల కలిగిన ప్రయోజనాలు సభకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా వేణుగోపాల దత్తాత్రేయ ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హాజరై గురువుకు అభిషేకం చేశారు. రామదూత గురువు వేణుదత్తాత్రేయ పాదపూజ కార్యక్రమం కనుల పండువగా సాగింది. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సువర్ణలక్ష్మి, అష్టలక్ష్మి సిద్ధి వ్రతదీక్ష చేపట్టిన మహిళలు దీక్షలను విరమించారు. నిష్ఠతో దీక్ష చేసిన వారి కుటుంబాల్లో అపమృత్యువు, ఆపదలు, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని తిరుమలరాజు సందేశమిచ్చారు. వేడుకల సందర్భంగా కళాశాల మైదానం అంతాఆధ్యాత్మికతతో నిండిపోయింది. సాయంత్రం రథోత్సవం రమణీయంగా సాగింది.

బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్యే పూజలు


పోల్కంపల్లిలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: పోల్కంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాలకు ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు యాదవులు గొంగడి కప్పి పొట్టేలును బహుకరించారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

– బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

మూసాపేట మండలం నిజాలాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు నారాయణ అనారోగ్యానికి గురి కావడంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, రామన్‌గౌడ్, బగ్గి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, యాదయ్య, రాములు యాదవ్, కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, నారాయణ ఉన్నారు.

తల్లి దీవెనలు పొందిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే


తన తల్లి లక్ష్మీదేవమ్మకు పాదాభివందనం చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


తల్లి వరలక్ష్మికి పాదాభివందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: తల్లిని మించిన దైవం లేదని అమ్మ ప్రేమ కొనలేనిది, విలువ కట్టలేనిదని చెప్పవచ్చు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ బడా నేతలు తమ తల్లులకు పాదాభివందనాలు చేసి దీవెనలు తీసుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి మాతృదినోత్సవం సందర్భంగా తల్లి లక్ష్మీదేవమ్మకు పాదాభివందనం చేసి దీవెనలు తీసుకున్నారు. అదే విధంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన తల్లి వరలక్ష్మికి పాదాభివందనాలు చేసి దీవెనలు పొందారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



దేవరకద్ర రూరల్: పార్టీలకు అతీతంగా కేవలం అర్హత ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కులను అందిస్తున్నట్లు కౌకుంట్ల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఇస్రంపల్లికి చెందిన సాయమ్మ, జయమ్మలకు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.60వేల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణయ్య, సలాం, మన్యం, తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డుపై గుంతలు



అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లి నుంచి చెన్నంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. చెరువుకట్టపై బీటీరోడ్డుకు చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో అప్పుడప్పుడు కొంత మట్టిని వేస్తున్నా ఉపయోగం లేకపోతోంది. గుంతల్లో ఉన్న మట్టి చిన్న వానకే కొట్టుకుపోతోంది. ఇటీవల కంకర వేసి దానిపై మట్టిని వేసినా మళ్లీ కంకర తేలి గుంతలు కనిపిస్తున్నాయి. కట్ట దాటిన తర్వాత రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో పాటు మలుపుల వద్ద ఉన్న గుంతలతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణానికి పాట్లు



అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ చెరువు కట్టపై పెరిగిన కంప చెట్లతో వాహనదారులకు పాట్లు తప్పడం లేదు. కట్టకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగాయి. దీనివల్ల కట్టపై వాహనాలు ఎదురు పడితే సులువుగా వెళ్లడానికి వీలు కావడం లేదు. కట్టపై భారీ వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులకు కంప చెట్లు కళ్లకు తగిలేలా ఉన్నాయి. ఇటీవల ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి ఓ ఆటో చెరువులోకి పల్టీ కొట్టింది. పొన్నకల్ వైపు నుంచి రాచాల, నందిపేట, జీనుగరాల, డోకూర్, దేవరకద్ర గ్రామాలకు ఇదే రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కంప చెట్ల మూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నందున వాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పేదింటి పెళ్లికి చేయూత



దేవరకద్ర: మండలంలోని అడవి అజిలాపూర్ గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన శ్రావణి వివాహం ఆదివారం జరిగింది. ఆమె తండ్రి మృతి చెందగా పేదరికంలో ఉన్నట్లు గ్రామస్తులు తెలపడంతో స్పందించిన కాంగ్రెస్ నాయకులు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ దంపతులు తమవంతుగా పుస్తే మెట్టెలు, పట్టు చీర అందించారు. ఈ సందర్భంగా వివాహానికి హాజరై కొత్త జంటను దీవించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఊట్కూరు: ఊట్కూరులోని ఎల్‌బినగర్‌లో శ్రీశ్రీ పడమటి ఆంజనేయస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులచే హోమ కార్యక్రమం చేపట్టారు. సోమవారం సాయంత్రం రథోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు కృష్ణయ్యగౌడ్, శంకర్‌గౌడ్, వెంకటేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


ఎమ్మెల్యేను కలిసిన ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాత్రికేయ మిత్రుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ భవనం ఆధునీకరణ కోసం ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎస్టిమేట్ చేయించాలని సూచించారు. మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్‌కు రాష్ట్రంలోనే మంచి పేరు తెచ్చే విధంగా కమిటీ పనిచేయాలని కోరారు. రాజకీయాలకతీతంగా, సామాన్యులకు అండగా ఉంటూ ప్రజా సమస్యల్ని ప్రభుత్వానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయంగా పనిచేయాల్సిన బాధ్యత నూతన కమిటీ భుజస్కందాలపైన ఉందన్నారు. సమాజహితమైన వార్తలపైన దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్‌చారి, నరేందర్‌గౌడ్, కోశాధికారి యాదయ్య, ఉపాధ్యక్షులు చింతకాయల వెంకటేశ్, ధరణి, సంయుక్త కార్యదర్శులు సతీష్‌కుమార్, కృష్ణ, మణిప్రసాద్, ఈసీ సభ్యులు రవికుమార్, రాంకొండ, షాబుద్దీన్ ముల్ల, అహద్‌సిద్దిఖీ, ఆయా దిన పత్రికల బ్యూరో ఇన్‌చార్జులు కిషోర్‌కుమార్, రవీందర్‌రెడ్డి, శివకుమార్, వెంకటేశ్వర్‌రావు, మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు కష్టం.. రోడ్డు పాలు



మాగనూర్: రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామన్నా నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదివారం మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన కొందరు రైతులు ట్రాక్టర్లలలో ధాన్యం లోడ్‌ను రాయచూర్‌కు తరలిస్తున్న క్రమంలో మాగనూర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సుమారుగా 10కి పైగా ధాన్యం బస్తాలు జారిపడి ధాన్యం మొత్తం రోడ్డు పాలైంది. రైతులు పండించిన పంటను ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నాయకులు ఇస్తున్న హామీలు క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. మిల్లుల దగ్గరకు తీసుకెళ్లిన ధాన్యాన్ని అధికారులు త్వరగా కొనుగోలు చేయకపోవడంతో పలువురు రైతులు చేసేదేమి లేక తక్కువ ధర అయినా రాయచూర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇలా ప్రమాదానికి గురై ఆర్థికంగా చితికిపోతున్నారు.

ధాన్యం తరలింపునకు లారీలు పంపించండి

మరికల్: ధాన్యం తరలించే విషయంలో మిల్లర్లు ఆలస్యం చేయకుండా లారీలను పంపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి కోరారు. మిల్లులకు ధాన్యం తీసుకురావడానికి గన్నీ బ్యాగులు, లారీలు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని రైతులు ఆదివారం ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన ఆయన రైతులకు నష్టం కలగకుండా మిల్లర్ల యజమానులు లారీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. లేకపోతే అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంపై సానుకులంగా స్పందించిన మిల్లర్ల నిర్వాహకులు.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ లోకంలో తల్లిప్రేమ వెలకట్టలేనిది

- పాస్టర్ రెవరెండ్ బీఎస్ పరంజ్యోతి
- ఘనంగా మదర్స్ డే వేడుకలు


ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ బీఎస్ పరంజ్యోతి

స్టేషన్ మహబూబ్‌నగర్: పిల్లలకు, కుటుంబానికి ఎనలేని తన ప్రేమను పంచుతూ, వారిని చక్కబెట్టడమే కాకుండా, అందరికీ ఆదర్శంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న తల్లి ప్రేమ వెలకట్టలేనిదని పాస్టర్ రెవరెండ్ బీఎస్ పరంజ్యోతి అన్నారు. ప్రపంచ మదర్స్ డే సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని రెమా వర్షిప్ సెంటర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబం, సమాజం పట్ల బాధ్యతగా రాణిస్తున్న తల్లిప్రేమను తెలియజేసేందుకు ఈ రోజు మదర్స్ డే వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తల్లి తన బాధ్యతల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఆ కుటుంబాలు చిన్నాభిన్నమైన ఘటనలు మనం చాలా చూశామన్నారు. పిల్లలు మంచి మార్గంలో పయనించేలా ప్రతి తల్లి కృషి చేయాలని కోరారు.

–తల్లులకు ఘన సన్మానం

మదర్స్ డే సందర్భంగా రెమా వర్షిప్ సెంటర్‌లో దాదాపు 60 మంది తల్లులను పాస్టర్ బీఎస్ పరంజ్యోతి ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి ప్రత్యేక బహుమతులు అందజేసి వారి క్షేమం కోసం ప్రార్థించారు. మదర్స్ డే సందర్భంగా ధీరజ్ పాల్ ప్రత్యేకంగా పాటను రాసి, పాడి రూపొందించిన యూ ట్యూబ్ సాంగ్‌ను పాస్టర్ బీఎస్ పరంజ్యోతి ప్రార్థించి రిలీజ్ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు భరత్, చంద్రశేఖర్, దేవయ్య, బల్‌రాం, లక్ష్మన్న, రాజుతో పాటు ప్రైయిజీరాణి, బ్లాండీనా, మహిమ, మణెమ్మ, అధిక సంఖ్యలో విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ టవర్ తొలగింపు


ప్రమాదకరంగా ఉన్న 33 కేవీ విద్యుత్ టవర్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది


ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్‌ను తొలగిస్తున్న సిబ్బంది

- 'సాక్షి' కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులు
- 33కేవీ విద్యుత్ వైర్లు మార్చి వెంటనే టవర్ తొలగింపు
- ఏడీ తౌర్యానాయక్ పర్యవేక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చౌరస్తాలోని 167 జాతీయ రహదారి మల్లికార్జున ఎంటర్ ప్రైజెస్ ముందు ప్రమాదకరంగా ఉన్న 33 కేవీ విద్యుత్ టవర్‌పై 'సాక్షి'లో వచ్చిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. రోడ్డు మధ్యలో ఉండడంతో ఇక్కడ తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో ఈ చౌరస్తాలో రోడ్డు ప్రమాదం వల్ల మలబార్ జ్యువలరీ దుకాణం ముందు ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటనలను కథనం రూపంలో విద్యుత్ అధికారుల దృష్టికి తేవడం జరిగింది.

సాక్షి ఎఫెక్ట్..

విద్యుత్ శాఖ టౌన్ ఏడీ తౌర్యానాయక్ నేతృత్వంలో ఆదివారం తన సిబ్బందితో పాత టవర్‌కు ఉన్న విద్యుత్ వైర్లను అప్పటికే సిద్ధంగా ఉన్న టవర్‌కు మార్చారు. వైర్లను మార్చడంతో పాటు పాత టవర్‌ను తొలగించారు. దీంతో కొన్ని ఏండ్ల నుంచి ఉన్న సమస్యకు పరిష్కారం దొరికినట్టైంది. టవర్‌ను తొలగించడంతో రాంగ్ రూట్‌లో ద్విచక్ర వాహనాలు కాకుండా కార్లు సైతం రావడం తగ్గింది.

లక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం

మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నరసింహస్వామి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి జల, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు శివరామ్‌ప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహ, రాములమ్మ,సిద్ధమ్మ, ఆంజనేయులు,రామకృష్ణ, ఆశన్నలు పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ క్యాంప్ ప్రారంభం


జడ్చర్లలో సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న క్రీడాప్రతినిధులు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల పట్టణంలో ఆదివారం సమ్మర్ క్రికెట్ క్యాంపును సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ప్రారంభించారు. పట్టణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన వివరించారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల ప్రతిభ ఇలాంటి క్యాంపులలో బయటపడుతుందన్నారు. వారి ప్రతిభకు ఇదే మంచి అవకాశమని ఆయన వివరించారు. ఈ క్యాంపు వచ్చే 10వ తేదీ వరకు నెలరోజులు కొనసాగుతుందని ఆయన వివరించారు. ఇప్పటికే ఇక్కడ 150 మంది చిన్నారులు క్రీడల్లో శిక్షణ పొందుతుండటం చాలా గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌వైబ్ల్యూసీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి, కౌన్సిలర్ ఉమాశంకర్, ప్రభాకర్‌రెడ్డి, క్రికెట్ ప్రతినిధులు మహేష్‌బాబు, శ్రీహరి, కుమార్, ముజీబ్, అన్సారీ, పీఈటీలు రాములు, శంకర్‌నాయక్, మేయిన్లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మోర్త్ భవనం

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం
- భవనంలో సామగ్రి అపహరణ



జాతీయరహదారిపై ఉన్న మోర్త్ భవనం


నిరుపయోగంగా ఉన్న భవనం

జడ్చర్ల టౌన్: 44వ నెంబరు జాతీయ రహదారిపై ప్రభుత్వ అతిథిగృహం సమీపంలో ఉన్న మోర్త్ (మినిస్ట్రి ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్) భవనం నిరుపయోగంగా మారింది. దీంతో భవనంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ముఖ్యంగా భవన సామగ్రి అపహరణకు గురవుతున్నా ఎవరు పట్టించుకోక పోవటం శోచనీయం. 1990వ దశకంలో 7వ నంబరు (ప్రస్తుతం 44వ నెంబరు) జాతీయ రహదారిపై లారీల రాకపోకలు అధికంగా సాగుతున్న నేపథ్యంలో లారీ డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ప్రభుత్వ అతిథిగృహం సమీపంలో భవనాలు నిర్మించారు. లారీలు నిలిపేందుకు వీలుగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తూ లారీ డ్రైవర్లు సేద తీరేందుకు అనువుగా 4 భవనాలు నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసినప్పటికి వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. 1994లో ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రసత్యం మినీబస్‌డిపో ఏర్పాటు చేయాలని భావించి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మినీబస్‌డిపో మంజూరు చేసింది. 1995 ఆగస్టులో ఎర్రసత్యం హత్యకు గురికావటంతో ఆ ప్రతిపాదనలు, మంజూరు నిలిచిపోయాయి. కొంతకాలానికి ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. జాతీయ రహదారుల శాఖ కొన్నాళ్ల పాటు వినియోగించింది. ఇదే క్రమంలో 2000లో ఆ భవనాలలో కోర్టు ఏర్పాటు చేయాలని అప్పటి ఎమ్మెల్యే ఎర్రశేఖర్ భావించినప్పటికి పట్టణానికి దూరంగా ఉండటంతో సాధ్యపడలేదు. ఆ తరువాత టెలికాం శాఖ కొన్నాళ్ల పాటు భవనాన్ని వినియోగించింది. జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన ఎల్‌అండ్‌టీ కంపెనీ సామగ్రి నిల్వ చేసుకునేందుకు, వర్కర్లు ఉండేందుకు ఉపయోగించింది. కొన్నాళ్ల క్రితం కావేరమ్మపేట వద్ద ఆర్‌యూబీ నిర్మాణం చేసిన కాంట్రాక్టరు సైతం ఆ భవనాన్ని వినియోగించారు. అప్పటి నుంచి నిరుపయోగంగానే మారింది. ప్రస్తుతం మినిస్ట్రి ఆఫ్ రోడ్‌ట్రాన్స్‌పోర్ట్ హైవేస్, నేషనల్ హైవే ఆఫ్ఇండియా అథారిటీ వాళ్ల స్వాధీనంలో భవనం ఉంది. ఆ శాఖ ఎలాంటి నిర్వహణ చేపట్టకపోవటంతో నిరుపయోగంగా మారింది. టూరిజం హోటల్ ఏర్పాటు చేస్తారని విస్తృతంగా ప్రచారం జరిగినప్పటికీ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

భవన సామగ్రి అపహరణ

భవనం నిరుపయోగంగా మారటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రాత్రిళ్లు విటులకు నిలయంగా మారింది. మద్యం ప్రియులు, పేకాటరాయుళ్లు ఆవాసంగా మార్చారు. మరికొందరు భవనాల్లోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు. తలుపులు, కిటికీలు, ఊచలు ఎత్తుకెళ్తున్నారు. భవనాల్లోని కప్‌బోర్డు సామగ్రి సైతం చోరీకి గురవుతోంది. విద్యుత్ తీగలు, బోర్డులు ఎప్పుడో ఎత్తుకెళ్లారు. భవనాల చుట్టూ ముళ్లపొదలు, కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విషసర్పాలు, క్రిమికీటకాలకు నిలయంగా మారుతుంది. ఇప్పటికైనా భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టి సారించి ఆ భవనాల్లో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం


చిన్నచింతకుంటలో వరి ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

చిన్నచింతకుంట: రాష్ట్ర ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్టంలో రైతులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రైతులు పండించిన వరి పంటను కొనుగోలు చేయడంలో విఫలమైందన్నారు. గన్నీ బ్యాగులు లేక ధాన్యాన్ని కల్లాలలో ఉంచుకోని రైతులు ఎండకు, వానకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనికి తోడు మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై తరుగు పేరుతో బస్తాకు రెండు కిలోల నుంచి మూడు కిలోల వరకు వడ్లను తీసి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డాడు. వరి కొనుగోలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్న రైతులకు ఇంకా బోనస్ అందలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, సీనియర్ నాయకుడు కుర్వరమేష్, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఆకుల అంజన్న, వనం నాగేష్, మనోహర్, హనుమంతు, వెంకటేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు


మహమ్మదాబాద్‌లో సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న కార్మికులు

మహమ్మదాబాద్: కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కురుమూర్తి, వెంకటేశ్‌లు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఈనెల 20న చేపట్టబోయే సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు తీర్చడంలో ఆలస్యం చేస్తున్నారని, కనీస వేతనాలు, పర్మినెంట్ ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాంటిటీ, పెన్షన్, 8 గంటల పని యథావిధిగా ఉండాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. దీంతో వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో వరద గాలన్న, చంద్రమ్మ, రఘు, రాములు, కిష్టయ్య, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.